# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 27-12-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.

2. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తోందని కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి సోమన్న తెలిపారు.

3. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

4. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీతో వెనుకబడి ఉన్న వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వై. సత్యకుమార్ తెలిపారు.

5. ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడెం జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 129వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

--------------------------

కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి సహకరిస్తోందని కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి వి.సోమన్న తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా చాకర్లపల్లిలో పునరాభివృద్ధి చేసిన రైల్వే స్టేషన్ ను కేంద్ర మంత్రి సోమన్న, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో కలిసి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి.కె. పార్థసారథి, పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

--------------------------

గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో 'పల్లె పండుగ

2.0' కార్యక్రమాన్ని ఆయన ఈరోజు ప్రారంభించారు. ఇందులో భాగంగా గజపతినగరం మండలం పురిటిపెంటలో 30 లక్షల రూపాయలతో పంచాయతీరాజ్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసమే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అభివృద్ధిని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు దగ్గర చేస్తోందని వివరించారు.

-----------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీతో వెనుకబడి ఉన్న వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని జిల్లా ఇరిగేషన్ కాంపౌండ్ శిక్షణ కేంద్రంలో మంత్రి అధ్యక్షతన డీఆర్సీ సమావేశాన్ని నిన్న నిర్వహించారు. అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదికల సత్వర రూపకల్పనపై దృష్టి సారిస్తున్నట్లు ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ తెలియజేస్తూ..

వాయిస్…27 సెకన్లు

-----------------------------

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పశ్చిమగోదావరి జిల్లా పెదమైన వానిలంక గ్రామంలో రేపు పర్యటిస్తారని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ప్రధానమంత్రి మన్ కీ బాత్ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి వీక్షిస్తారు. అనంతరం డిజిటల్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారికి ధృవీకరణ పత్రాలను అందేజేస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించి,సముద్రపు కోతకు గురవుతున్న ప్రాంతంలో రక్షణ గోడ నిర్మాణ పనులను పరిశీలిస్తారు. మధ్యాహ్నం కవిటం చేరుకుని నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతీ సమేత సోమేశ్వర స్వామి ఆలయాన్ని ప్రారంభిస్తారు.

-----------------------------

వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలకు వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ తెలిపారు. తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనంలో ఆయన పాత్రికేయులతో ఈరోజు మాట్లాడారు. ఈ నెల 30వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు పది రోజుల పాటు భక్తులను వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతించనున్నట్లు వివరించారు. ఈనెల 30, 31, జనవరి 1వ తేదీలకు సంబంధించిన టోకెన్లను భక్తులకు ఆన్ లైన్ ద్వారా ఇప్పటికే అందించినట్లు టిటిడి కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్ తెలియజేస్తూ…

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

దేశ అభివృద్ధి ప్రయాణంలో 2025 సంవత్సరం ఒక నిర్వచనాత్మక అధ్యాయంగా నిలుస్తుంది. 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో పన్నుల రంగంలో దేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న కథనం.. గత 8 ఏళ్లుగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన పన్ను సంస్కరణలు.. 2025లో కీలక మార్పును సంతరించుకున్నాయి. 2017లో వస్తు సేవల పన్ను- GST ప్రవేశపెట్టడంతో పన్నుల రంగంలో సంస్కరణలకు నాంది పలికినప్పటికీ, బహుళ స్లాబ్‌లు, వర్గీకరణ సమస్యలు

నెలకొన్నాయి. ఈ ఏడాది, బహుళ స్లాబ్ లను కుదించి 5, 18 శాతంతో రెండు ప్రధాన స్లాబ్‌లుగా హేతుబద్ధీకరించారు. కొన్ని వస్తువులను జీఎస్టీ నుంచి మినహాయించారు. దీంతో వినియోదారులపై పన్ను భారం కొంత మేర తగ్గడంతో పన్నుల రంగంలో చేపట్టిన ఈ తరువాతి తరం జీఎస్టి సంస్కరణపై దేశ వ్యాప్తంగా ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతోంది.

---------------------------

ఏలూరు జిల్లా భీమడోలు మండలం సూరప్పగూడెం జాతీయ రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈరోజు తెల్లవారుజామున కొవ్వూరు-గుండుగొలను జాతీయ రహదారి మీదుగా ఏలూరు వైపు బయలుదేరిన యువకులు సూరప్పగూడెం వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

---------------------------

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం పంపిణీ చేయాల్సిన ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను ఈనెల 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచే గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లను అందజేయనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

సారస్ (SARAS- సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిసన్స్ సొసైటీ)ను మినీ భారత సాంస్కృతిక, కళా సమ్మేళనంగా నిర్వహిస్తున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ అన్నారు. సారస్ ప్రదర్శన శాల ఏర్పాట్లపై గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి ఆరు వందల మందికి పైగా చేనేత, హస్త కళాకారులు, సాంస్కృతిక కళాకారులు వస్తున్నారని, 250కు పైగా ప్రదర్శన శాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ ఉపయోగించని వేడుకగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

---------------------------

శ్రీలంక మహిళల క్రికెట్ జట్టు భారత పర్యటనలో భాగంగా.. ఐదు టీ 20 మ్యాచ్ సీరీస్ లో నాలుగో టి 20 క్రికెట్ మ్యాచ్ శ్రీలంక, భారత్ జట్ల మధ్య రేపు జరగనుంది.కేరళ రాష్ట్రంలోని తిరువనంతపురంలో రేపు సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు జరిగిన మ్యాచ్ లలో భారత్ మూడు విజయాలు సాధించి, సీరిస్‌ను 3-0తో కైవసం చేసుకుంది.

---------------------------

ప్రజాదర్బార్ లో స్వీకరించిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కారించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఏలూరు జిల్లా నూజివీడులోని మంత్రి క్యాంపు

కార్యాలయంలో ప్రజాదర్బారును నిన్న నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వారం వారం నిర్వహించే ప్రజాధర్బారుకు హాజరైన ప్రజలు, ఇచ్చిన అర్జీలను సంబంధిత శాఖలు అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. త్వరితగతిన అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాం, దక్షిణ కోస్తాల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎల్. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్.. 17 సెకన్లు

=======================